T. HARISH RAO
M.L.A.,
33-Siddipet Assembly Constituency &
Deputy Floor Leader, BRSLP

Hyderabad Office :
Flat No. 805,
MS-III Block, OLD MLA Quarters
Hyderguda, Hyderabad - 500029.
Contact No. 040-23114222,
Cell :98661 99999
E-mail : harishrao1116@gmail.com

గౌరవనీయులైన శ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి గారికి,

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి.

విషయం: రాజకీయ కక్షతో రద్దు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1,070 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలి. గతంలో సిద్దిపేట ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోనందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రజల పక్షాన నేను అడుగుతున్న ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీపై ఉంది.

. "కొమురవెల్లి మల్లన్న" దేవుడి సాక్షిగా చేసిన రుణమాఫీ హామీ ఏమైంది? 2024 మే 2వ తేదీన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మొదటిసారి ముఖ్యమంత్రి హోదాలో సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాకు వచ్చి నూటికి నూరు శాతం రైతులకు రుణమాఫీ చేస్తానని కొమురవెల్లి మల్లన్నపై ప్రమాణం చేసి చెప్పారు. కానీ ఇప్పటికీ సగం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. ఒక్క సిద్దిపేట నియోజకవర్గంలోనే ఇంకా 22,819 మంది రైతులకు రుణమాఫీ జరగాల్సి ఉంది. 20,514 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగింది. దాదాపు 60 శాతం మంది రైతులు నేటికీ రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. దేవుడి సాక్షిగా

ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోలేని మీ పాలనకు ఏమని పేరు పెట్టాలి?

. 45 రోజుల్లో రైతుభరోసా ఇస్తామన్న హామీ ఏమైంది?

2026 మార్చి 22వ తేదీన సిద్దిపేట నియోజకవర్గం నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రెండోసారి వచ్చారు. వాస్తవానికి ఆ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ, భూసేకరణ చేసి, నిధులు కేటాయించి, నిర్మాణానికి శ్రీకారం చుట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఆ సందర్భంగా మీరు ఇచ్చిన మరో హామీని గుర్తుచేస్తున్నాను. 45 రోజుల్లోనే రూ.9,000 కోట్ల రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. కానీ నేటికి 230 రోజులు గడుస్తున్నా, అందులో రైతులకు పావు వంతు డబ్బులు కూడా అందలేదు.

రెండు సందర్భాల్లోనూ ఇచ్చిన మాట తప్పి మూడో సారి మళ్ళీ వస్తున్నావు. తక్షణమే రుణమాఫీ, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సిద్దిపేట ప్రాంతం మరియు రాష్ట్ర రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నాను

. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కు ఎందుకు తరలించారు?

సిద్దిపేట జిల్లా దుద్దెడ వద్ద రూ.300 కోట్లతో ప్రభుత్వ వెటర్నరీ కాలేజీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. శరవేగంగా సాగుతున్న పనులను మీరు ఎందుకు రద్దు చేశారు? సిద్దిపేటకు మంజూరైన ఈ కాలేజీని కొడంగల్‌కు ఎందుకు తరలించారు?

వెంటనే ఈ కాలేజీని తిరిగి సిద్దిపేటలోనే కొనసాగిస్తూ, నిలిచిపోయిన నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నాను.

. సిద్దిపేట అభివృద్ధి పనులకు రద్దు చేసిన రూ.1,070 కోట్ల నిధులు ఎప్పుడు విడుదల చేస్తారు?

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట నియోజకవర్గంలో రూ.1,070 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ నిధులను రద్దు చేసి, పనులన్నింటినీ నిలిపివేసింది. సిద్దిపేటపై కక్షతో నిలిపివేసిన పనులన్నింటినీ వెంటనే పునఃప్రారంభించాలి. రద్దు చేసిన రూ.1,070 కోట్ల నిధులను తిరిగి విడుదల చేయాలని సిద్దిపేట ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నాను

. సిద్దిపేటకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎందుకు మంజూరు చేయలేదు?

సిద్దిపేటపై వివక్ష లేదని, విషం కక్కడం లేదని చెబుతున్నారు కదా! మరి రాష్ట్రంలోని 87 నియోజకవర్గాలకు మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను సిద్దిపేట నియోజకవర్గానికి ఎందుకు మంజూరు చేయలేదు?.. ఇప్పటికైనా తక్షణమే సిద్దిపేట నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను మంజూరు చేసి పనులు మొదలుపెట్టాలని డిమాండ్ చేస్తున్నాను.

కేసీఆర్ గారు ప్రారంభించిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ఎందుకు నిలిపేశారు, తిరిగి ఈ పథకాన్ని ప్రారంభించిన మీరు సిద్దిపేట నియోజకవర్గ ప్రభుత్వ పాఠశాలల్లో ఎందుకు అమలు చేయడం లేదు? ఇది వివక్ష కాకపోతే మరేమిటి? సిద్దిపేట విద్యార్థులపై మీకున్న కక్ష కాకపోతే ఇంకేమిటి? వెంటనే బ్రేక్ ఫాస్ట్ ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నాను.

- వంట నష్ట పరిహారం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కెసిఆర్ గారు ఆ రోజుల్లో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేల సహాయం ఇచ్చి ఆదుకున్నారు. మీరు మాత్రం ఇప్పటివరకు అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదు . సిద్దిపేట జిల్లాలో మూడు సీజన్లలోను రైతులకు తీవ్ర నష్టం జరిగింది. మీ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొన్నం ప్రభాకర్, శ్రీధర్, బాబు స్వయంగా వచ్చి పంటలు పరిశీలించి రెండేళ్లు గడుస్తున్నా నయా పైసా ఇవ్వకపోవడం రైతులపై మీ ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పడుతున్నది.

- మీ ఆర్భాటం, మీ ప్రగల్భాల గురించి ఓ సందర్భం గుర్తు చేస్తాను. మార్చి నెలలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి వచ్చినప్పుడు సిద్దిపేటలో ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రిని ప్రారంభించి వెళ్ళావు. ఈ ఆసుపత్రి మంజూరు చేసి, నిధులు కేటాయించి నిర్మించింది కూడా బి.ఆర్.ఎస్ హయాంలోనే అయినప్పటికీ మీ చేతుల మీదుగా ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు వైద్య సేవలు మొదలు కాలేదు. రోగులకు సేవలందించలేక వెలవెలబోతున్నది.

- కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో నిర్మించిన అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ల ప్రధాన కాలువలను బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిచేసింది. తదనంతరం పంట కాలువల నిర్మాణం చేపట్టి రైతులకు సాగునీళ్ళు ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. కానీ పంట కాలువల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఎకరమైనా భూమి సేకరించారా.. ? ఒక్క రూపాయి అయినా కేటాయించారా..?

నీళ్లు ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ నీళ్లు ఎత్తలేక సిద్దిపేట జిల్లాపై పగతో ప్రజల నెత్తిన కరువు రుద్దారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. మీ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు అని మీ చర్యలే రుజువు చేస్తున్నాయి.

చేర్యాల ప్రాంతాన్ని సస్యశ్యామలంగా మార్చడానికి మల్లన్న సాగర్ నుండి తపాస్ పల్లి రిజర్వాయర్ కు నీటిని తరలించే కాలువను కెసిఆర్ గారి హయాంలో సగం మేర పూర్తి చేశాం. మీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అర్ధంతరంగా నిలిపివేశారు.

హుస్నాబాద్ మెట్ట ప్రాంత రైతుల బాధలు తీర్చడానికి బి.ఆర్.ఎస్ ప్రభుత్వం నిర్మించిన గౌరవెల్లి రిజర్వాయర్ ట్రయల్ రన్ కూడా పూర్తి చేశాం. కానీ తుది పనులు పూర్తి చేయడానికి మూడేళ్లయినా అడుగు ముందుకు పడలేదు.

మల్లన్న సాగర్ నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వాలని అనాడు దీక్ష చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఉండి మల్లన్న సాగర్ నిర్వాసితులకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా.. వారి గోడు మీకు వినిపించడం లేదా.. కనిపించలేదా? తక్షణమే వారికి రావాల్సిన మెరుగైన పరిహారం విడుదల చేసి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాను.

100 రోజుల్లో పూర్తి చేస్తామన్న మీ 6 గ్యారంటీలు ఏమయ్యాయి. మహిళలకు ప్రతీ నెల ఇస్తానని చెప్పిన రూ.2500 అమలయ్యేదెన్నడు..? మహిళలు ఒక్కొక్కరికి రూ.90 వేల చొప్పున... వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఒక్కొక్కరికి రూ.72 వేలు బాకీ పడ్డావు.

ఫీజు రీయింబర్స్మెంట్ కింద 20 లక్షల మంది విద్యార్థులకు ఫీజు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఈ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాను.

సిద్దిపేటపై వివక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిన పనుల జాబితా ఇవి:

- 1000 పడకల ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రి పనులు అర్ధాంతరంగా ఆపివేశారు.

- ప్రభుత్వ వెటర్నరీ కళాశాల.

- సిద్దిపేట నియోజకవర్గ ఔటర్ రింగ్ రోడ్డు.

- తోర్నాలలో బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల భవన నిర్మాణం
- రంగనాయకసాగర్ టూరిజం ప్రాజెక్టు.

- కోమటిచెరువు శిల్పారామం.

- మిట్టపల్లిలో ప్రభుత్వ ఎస్సీ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల భవనం.

- సిద్దిపేటలో క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ హబ్.

- టూ టౌన్ పోలీస్ స్టేషన్ భవనం.

- త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ భవనం.

- సిద్దిపేట–ఇల్లంతకుంట ఫోర్‌లేన్ రోడ్డు.

- సిద్దిపేటలో మల్టీపర్పస్ ఆడిటోరియం.

- సిద్దిపేట బ్లాక్ ఆఫీస్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్

- పంచాయతీ రాజ్ మరియు ఆర్ అండ్ బి రహదారులు

- మూడేళ్లుగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పనులు నిలిచిపోయాయి.

ముఖ్యమంత్రి గారూ..

సిద్దిపేట ప్రజలు కోరుతున్నది ప్రత్యేక ప్రాధాన్యత కాదు.. వారికి రావాల్సిన నిధులు, ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులు మాత్రమే. రెండుసార్లు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయారు. మూడోసారి సిద్దిపేటకు వస్తున్నప్పుడు కొత్త హామీలతో ప్రజలను మభ్యపెట్టకుండా, గతంలో ఇచ్చిన మాటలను నిలబెట్టుకోండి. వ్యక్తిగత దూషణలకే పరిమితం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారం గురించి ఆలోచించు. చేసిన తప్పును సరిదిద్దుకుని సిద్దిపేట ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పండి.

నా మీద రాజకీయ కక్ష ఉంటే నాతో రాజకీయంగా తలపడండి. నన్ను తిడితే ప్రజల కోసం భరిస్తా. అంతేకానీ ఆ కక్షను సిద్దిపేట ప్రజలపై చూపకండి. ముఖ్యమంత్రి స్థాయికి అది తగదు. సిద్దిపేట ప్రజల ఆత్మగౌరవంతో చెలగాటం ఆడొద్దని హితవు చెబుతున్నా. ఇకనైనా వట్టి మాటలు కట్టిపెట్టి, ఇచ్చిన మాట నిలబెట్టుకోండి.

ధన్యవాదాలు..

భవదీయుడు,

(తన్నీరు హరీష్ రావు)